


## లక్ష కుంకుమార్చనకు ముమ్మర ఏర్పాట్లు



చౌడేపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ఈనెల 28నుంచి మార్చి 1వరకు నిర్వహించ నున్నారు. ఇందులో భాగంగా ఆలయం సముదాయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు పర్యవేక్షించారు. అమ్మవారికి ప్రీతిపాత్ర మైన లక్షకుంకుమార్చనను యేటా మాఘ మాసం కృష్ణపక్షం చవితి నుంచి షష్టీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు. ఈక్రమంలో ఆలయాన్ని రంగు రంగుల పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. లోకశాంతి కోసం జరుగుతున్న కుంకుమార్చనకు భక్తులు పాల్గొని గంగమ్మకు కృపకు పాత్రు కావాలని ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు కోరారు.

## అలా 'సెట్' చేశారు ...?

### కృష్ణా జలాలు రాకపోవడంపై దేశం శ్రేణుల ఆగ్రహం

### హంద్రీ-నీవా కాలువల్లో బైఠాయించి నిరసన !!



ఎంకె పురం హంద్రీ-నీవా కాలువల్లో బైఠాయించిన దేశం శ్రేణులు



రాజుపేటలో కృష్ణాజలాలు ప్రారంభించిన చోట గేట్ పరికరాలు తొలగిస్తున్న దృశ్యం

శాంతిపురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

శాంతిపురం మండలంలోకి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు రాకపోవడంతో శాంతిపురంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పనులు పూర్తికాకనే కృష్ణాజలాలు అందించామని చెప్పేందుకే వైకాపా నేతలు సిఎం జగన్ చేత నీటిని ప్రారంభించారని విమర్శించారు. శాంతిపురం మండలం ఎంకెపురం - గుండిశెట్టిపల్లి వద్ద గల హంద్రీ- నీవా కాలువల్లో తెదేపా నేతలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా తెదేపా నేతలు మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి సోమవారం ఎంతో ఆర్భాటంగా కృష్ణాజలాలను రామకుప్పం మండలం రాజుపేట వద్ద ప్రారంభించారన్నారు. అయితే సిఎం ప్రారంభించిన రాజుపేట వద్దనే రాత్రి కల్లా నీటి ప్రవాహం నిలిచిపోయిందన్నారు. తమ ప్రాంతాల్లోకి ఇంకా చుక్కనీళ్లు కూడా రాలేదని పేర్కొన్నారు. కేవలం కుపా ్పనికి నీళ్లు తెచ్చామని చెప్పడం కోసమే ముఖ్యమంత్రి చేత కృష్ణాజలాలను ప్రారంభించడం దారుణమన్నారు. కుప్పం ప్రాంత రైతులు, ప్రజలకు తాగునీరు అందించాలని గతంలో చంద్రబాబునాయుడు 463కోట్లతో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పనులు ప్రారంభించగా 2019 నాటికి 87శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగతా 13శాతం పనులు పూర్తి కాకనే ఆఘమేఘాలపై కాలువల్లోకి కృష్ణాజలాలు వచ్చేశాయని సిఎంచేత ప్రారంభించి ప్రజలను మోసగించడం దారుణమన్నారు. ఇదిలా ఉండగా రామకుప్పం మండలంలో సోమవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి కృష్ణాజలాలను ప్రారంభించిన చోట ఏర్పాటు చేసిన గేట్‌ను సైతం మంగళవారం లారీల్లో తరలించేశారు. మరో పక్క నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయా ప్రాంతాల్లో ఉన్న హంద్రీ-నీవా కాలువల వద్దకు చేరుకుని కాలువల్లో నీరు రాలేదని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించారు.

## పిఎస్ఎల్‌వి రాకెట్ల తయారీ ఇక మరింత సులువు

### - పిఐఎఫ్ భవనం అందుబాటులోకి - వర్చువల్ విధానం ద్వారా ప్రధాని మోడీ ప్రారంభం







పిఐఎఫ్‌ను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, భారత తొలి గగన్‌యాన్‌లో వెళ్లనున్న నలుగురు వ్యోమగాములు

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

శ్రీహరికోటలో అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన పిఎస్ఎల్‌వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్ నుంచి ప్రధాని షార్‌లో పిఎస్ఎల్‌వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీతో పాటు మహేంద్ర గిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో నూతన సెమీ క్రయోజనిక్ ఇంటిగ్రేటెడ్ ఇంజన్ మరియు స్టేజ్ టెస్ట్ సదుపాయం, తిరువనంతపురంలోని విఎస్ఎస్‌సి వద్ద ట్రిసోనిక్ విండ్ టెన్నల్‌ను ఒకేసారి జాతికి అంకితం చేశారు. ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో ఇతర దేశాలకు ఏమాత్రం తీసిపోని అత్యున్నత స్థాయి సాంకేతిక సౌకర్యాలను అందిస్తున్న ఈ మూడు ప్రాజెక్టులు సుమారు రూ.1800 కోట్లతో నిర్మించబడ్డాయి. ముఖ్యంగా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్‌లో పిఐఎఫ్ అందుబాటులోకి రావడంతో ఏడాదికి ఆరు నుంచి 15 పిఎస్ఎల్‌వి రాకెట్ల తయారీకి అవకాశం ఏర్పడింది. నెలకు ఒకటి కన్నా ఎక్కువ పిఎస్ఎల్‌విలను తయారు చేసుకొని మన దేశీయ, విదేశాల ఉపగ్రహాలను సైతం షార్ నుంచి ప్రయోగించుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ వద్ద ఇది ప్రధానంగా రాకెట్ తయారీ అవసరాలకు ఉపయోగపడుతుంది. పిఎస్ఎల్‌వి రాకెట్లను ప్రయోగించడం మాత్రమే కాకుండా ఇక్కడే సకల సౌకర్యాలు కల్పించుకోవడంతో భవిష్యత్ ప్రయోగాలకు ఎంతో మేలవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌తో కలిసి ఆయన ఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పిఐఎఫ్ భవనంలో కనీసం ఆరు అత్యంత ఆధునిక నిర్మాణాలు కలిగి ఉన్నాయి. 66 మీటర్ల ఎత్తుగల ఇంటిగ్రేషన్ బిల్డింగ్‌లో నాలుగో దశ నిర్మాణానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. 320 టన్నుల సామర్థ్యం కలిగిన మొబైల్ లాంచ్ పెడస్టల్‌తో పాటు 18 మీటర్ల ఎత్తు కలిగిన ఎంఎల్‌పి సర్వీస్ బిల్డింగ్ ఇందులో భాగాలు. 1.5 కిలోమీటర్ల పొడవైన కర్వ్‌డ్ రైల్ ట్రాక్ ప్రధానమైనది. పిఎస్ఎల్‌వి రాకెట్ ఇంటిగ్రేషన్ భవనం నుంచి ఫస్ట్ లాంచ్ ప్యాడ్ దాకా ఈ రైల్వే ట్రాక్ ఉంది. వీటితో పాటు 10 సెట్లు కలిగిన ఫోల్డింగ్ ఫ్లాట్‌ఫారంలు ఇందులో ఆధునిక పద్ధతిలో రూపొందించారు. మొబైల్ లాంచ్ ప్యాడ్ పెడస్టల్‌పై ఈ ఫోల్డింగ్ ఫ్లాట్‌ఫారంలు ఉంటాయి. వీల్ బోగీ సిస్టం మరియు సెల్ఫ్ ప్రొపల్లెంట్ యూనిట్లు ఇందులో ఉన్నాయి. స్వయంగా ఇంధనం తయారు చేసుకునే సౌకర్యం కూడా ఈ ఆధునిక భవనం ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. శ్రీహరికోటలో మంగళవారం పిఐఎఫ్ భవనం ప్రారంభం సందర్భంగా శాస్త్రవేత్తలు, అధికారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. భవనం వద్ద ముఖ్యమైన అధికారులు వర్చువల్ విధానాన్ని వీక్షించి ప్రధాని ప్రారంభించగానే చప్పట్లు కొట్టారు. ఎంఆర్ కురుప్పు ఆడిటోరియం తదితర చోట్ల షార్ ఉద్యోగులు పెద్ద తెరలపై ఈ దృశ్యాలను వీక్షించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో పాటు పలువురు డిప్యూటీ డైరెక్టర్లు తిరువనంతపురం వెళ్లి నేరుగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

### గగన్‌యాన్‌లో వెళ్లే వ్యోమగాముల పరిచయం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టులో కీలక ఘట్టం మంగళవారం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ గగన్‌యాన్‌లో వెళ్లే నలుగురు వ్యోమగాములను పరిచయం చేశారు. వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వీరిలో ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగర్ ప్రతాప్, సుభాంసు శుక్లా ఉన్నారు. ప్రధానితో పాటు కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్, కేరళ ముఖ్యమంత్రి పినరై విజయన్, కేంద్రమంత్రి వి.మురళీధరన్, ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌లు ఈ యువకులను అభినందించారు.

## రైతుపై ఒంటరి ఏనుగు దాడి

### - ఏనుగును తమిళనాడుకు తరిమేసిన అటవీ అధికారులు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



బాధితుడ్ని పరామర్శిస్తున్న సబ్ డిఎఫ్ఒ వేణుగోపాల్

కుప్పం మండలం పైపాళ్యం గ్రామ సమీపంలో మంగళవారం వేకువ జామున ఒంటరి ఏనుగు ఓ రైతుపై దాడిచేసింది. దీంతో అతను ఏనుగు బారినుంచి తప్పించుకోగా కుటుంబీకులు చికిత్స నిమిత్తం అతన్ని కుప్పం పిఇఎస్‌కు తరలించారు. రామకుప్పం మండలం ననియాల అటవీ ప్రాంతం నుంచి ఓ ఒంటరి ఏనుగు సోమవారం రా త్రి కుప్పం మండలం నూలు కుంట, గోపినగర్ తదితర ప్రాంతాల్లో సంచరించింది. ఇదే ఏనుగు వేకువజామున పైపాళ్యం గ్రామం వద్దకు చేరుకుంది. గ్రామ సమీపంలో పూలతోటలో ఉన్న మునిరత్నం అనే రైతుపై ఏనుగు దాడికి దిగింది. ఎలాగోలా మునిరత్నం ఏనుగు బారి నుంచి తప్పించుకుని ఇంటికి పరుగులు తీశాడు. కుటుంబీకులు హుటాహుటిన అతన్ని చికిత్స నిమిత్తం పిఇఎస్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఒంటరి ఏనుగును అటవీ అధికారులు ట్రాకర్ల సాయంతో తమిళనాడులోని అటవీ ప్రాంతంలోకి మంగళవారం మధ్యాహ్నం తరిమేశారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునిరత్నంను సబ్ డిఎఫ్ఒ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్వో వైసి రెడ్డి, డిఆర్వో కృష్ణప్రసాద్ పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని సబ్ డిఎఫ్ఒ వేణుగోపాల్ బాధిత కుటుంబానికి తెలిపారు. కాగా ఏనుగు దాడిలో గాయపడ్డ మునిరత్నాన్ని కుప్పం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు సత్యేంద్రశేఖర్, మునిరత్నం తదితరులు పరామర్శించారు.

## నూతన మున్సిపల్ కమిషనర్ల నియామకం

కుప్పం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు నూతన ముని ్సపల్ కమీషనర్లను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం మున్సిపల్ కమీషనర్‌గా ఇదివరకు పోస్టింగ్ పొంది విధుల్లో చేరని సహాయ ఆడిట్ అధికారి చరణ్‌తేజ్‌రెడ్డిని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అదనపుకమీషనరుగా నియమించారు. కుప్పంకు నూతన మున్సిపల్ కమీషనరుగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటిండెంట్ బి. నాగేశ్వరరావును నియమించారు. అలాగే చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీగా పనిచేస్తున్న రాంబాబును శ్రీకాళహస్తి మున్సిపల్ కమీషనరుగా నియమించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమీషనరుగా పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమీషనరుగా బదిలీ చేశారు. అలాగే తిరుపతి స్టేట్ ఆడిట్ కార్యాలయంలో సహాయ ఆడిట్ ఆఫీసరుగా పనిచేస్తున్న కిరణ్‌ను మార్కాపురం మున్సిపల్ కమీషనరుగా బదిలీ చేశారు. తిరుపతి జిల్లా ఆడిట్ కార్యాలయంలో సీనియర్ ఆడిటర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని నందికొట్కూరు మున్సిపల్ కమీషనరుగా నియమించారు. వెంకటగిరి కమీషనరుగా పనిచేస్తున్న వెంకటరామయ్యను పెదన మున్సిపల్ కమీషనరుగా బదిలీ చేశారు. వెంకటగిరికి నూతన కమీషనరుగా అద్దంకి మున్సిపల్ కమీషనరు అబ్దుల్ రషీద్ నియమితులయ్యారు.

## చెట్టును ఢీకొన్న కారు

### -ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ యువకులు , పక్కనే నుజ్జయిన కారు

చౌడేపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

అతిగా మద్యం సేవించడమే కాకుండా పలువురిపై వాహన పోనిచ్చి తప్పించుకొనే ప్రయత్నంలో చెట్టును ఢీకొని ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పలమనేరు ప్రధాన మార్గంలో కర్ణాటకకు చెందిన కెఏ05ఎంటి0430నంబరు గల వాహనం అతి వేగంగా వస్తూ చిట్రెడ్డిపల్లి పల్లంలో కొందరిపైకి దూసుకెళ్ళింది. వాహనం ఆగకుండా వెళుతుండటంతో గుర్తించిన కొందరు కారును వెంబడించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అయితే పుంగనూరు మార్గంలోని దొరబావితోట వద్ద పోలీస్టేషన్‌కు కూతవేటు దూరంలో గల చెట్టును కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పెద్దపంజాని మండలం రాయలపేటకు చెందిన మధు(25), కూరకుపల్లికొత్తపేట జగదీష్(26), మారపల్లికి చెందిన మధు(26)లకు బలమైన గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108సేవల ద్వారా పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పుంగనూరు రూరల్ సిఐ కృష్ణారెడ్డి, ఎఎస్ఐ వాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సహాయక చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ఆనంపై సస్పెన్షన్ వేటు

### ఉత్తర్వులు అందిన తర్వాత కోర్టుని ఆశ్రయిస్తాం రామనారాయణ రెడ్డి



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

పార్టీ ఫిరాయించాలన్న ఆరోపణపై వెంకటగిరి శాసనసభ్యులు రామనారాయణ రెడ్డి పై స్పీకర్ తమ్మినేని సీతారాం సస్పెన్షన్ విధించారు. 2019వ సంవత్సరంలో వైసిపి పార్టీ నుండి పోటీ చేసి ఆయన విజయం సాధించారు. ప్రభుత్వం పై వ్యతిరేక ప్రకటన చేస్తున్నారని ఆనంను పక్కనపెట్టి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డికి సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుండి ఆయన నియోజకవర్గానికి కొంత దూరంగా ఉన్నారు. పార్టీ ఫిరాయించారన్న ఆరోపణపై స్పీకర్ నాలుగు దపాలు నోటీసులు ఎవరిని ఇవ్వాలని ఇచ్చారు. ఎటకేలకు సస్పెన్షన్ వేటును విధించారు. తనకు సస్పెన్షన్ ఉత్తర్వులు అందిన వెంటనే న్యాయ సలహాలు తీసుకుంటానని చెప్పారు. కోర్టు కూడా న్యాయం కోసం వెళ్తారని ఆయన తెలిపారు. ఆనంతో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటారెడ్డి శ్రీధర్ రెడ్డిలు టిడిపి కండువా కప్పుకుని పార్టీలో చేరారు. నారాయణరెడ్డి మాత్రం టిడిపి పార్టీలో చేరకనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సంచలనంగా మారింది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



మృతి చెందిన చరణ్, హరీష్

రేణిగుంట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో మొలగ మూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చరణ్(29), హరీష్(21) మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మే రకు... నారాయణవనంకు చెందిన హరీష్, ఏర్పేడు మండలం అంజి మేడుకు చెందిన చరణ్ ద్విచక్రవాహనంపై పుత్తూరు వైపు నుంచి రేణిగుంట వైపు వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం మొలగముడి వద్ద వెనుక వస్తున్న ట్రాక్టర్‌ని ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పరసా దారెటు..?

### - షాలినీ రత్నం అసమ్మతి గళం - సూళ్లూరుపేట టిడిపిలో వర్గపోరు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో స్తబ్దుగా ఉన్న రాజకీయాల్లో ఒక్కసారిగా వేడెక్కాయి. పార్టీ అధిష్టానం అభ్యర్థిగా మాజీ ఎంపీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె నెలవల విజయశ్రీని ప్రకటించగానే వర్గపోరు ఒక్కసారిగా బహిర్గతమైంది. మాజీమంత్రి పరసా వెంకటరత్నం కుమార్తె షాలినీ రత్నం తన కుటుంబానికి అన్యాయం జరిగిందంటూ అసమ్మతి గళం విప్పింది. పార్టీకి 30 సంవత్సరాలుగా సేవలు అందిస్తూ నమ్మకంగా పనిచేస్తే పార్టీ అధిష్టానం కనీసం తమ కుటుంబ సభ్యుల అభ్యర్థిత్వాన్ని పరిశీలనకు కూడా తీసుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేయడం పార్టీ వర్గాల్లో ఒక్కసారిగా అలజడి ప్రారంభమైంది. తెలుగు దేశం పార్టీలో చంద్రబాబునాయుడికి విధేయుడుగా పేరు తెచ్చుకొని 1994 నుంచి 2019 వరకు పార్టీ టికెట్ తెచ్చుకొని మూడుసార్లు గెలిచి, మూడుసార్లు ఓటమి చెంది, ఒక పర్యాయం మంత్రిగా పనిచేసిన పరసా వెంకటరత్నం తన గళం విప్పకుండానే తన కుమార్తె ద్వారా అసమ్మతి గళం వినిపించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పార్టీ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. 1994, 1999లో సులభంగానే టికెట్ తెచ్చుకున్న పరసా అప్పటి వేనాటి వారి ఆశీస్సులు ఆయనకు తోడుగా ఉన్నాయి. 2004లో పెద్దఎత్తున బ్లోఅవుట్‌లాగా అసమ్మతి చోటుచేసుకున్నప్పటికీ వేనాటి వారి మద్దతుతో టికెట్ తెచ్చుకున్నప్పటికీ పరాజయం పాలయ్యారు. 2009లో మళ్లీ టికెట్ తెచ్చుకొని గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి తప్పలేదు. 2019లో ఊహకు అందని విధంగా సుమారు 62 వేల ఓట్లు తేడాతో ఓడిపోవడం పరసా వెంకటరత్నంకు పెద్ద మైనస్‌గా చెప్పవచ్చు. ఆ ఎన్నికల్లో పార్టీని పూర్తిగా గాలికొదిలేశారని, పట్టించుకోకపోవడంతోనే వైసీపీకి భారీ మెజార్టీ సాధ్యమైందని చెప్పుకున్నారు. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి పరసాను తప్పించి నెలవల సుబ్రహ్మణ్యంను పార్టీ నియమించింది. అందుకు తగ్గట్టుగా పరసా కొంతకాలం పార్టీకి అంటీముట్టనట్లుగా ఉంటూనే తిరిగి పుంజుకొని పార్టీ కార్యాక్రమాల్లో ముమ్మరంగానే పాల్గొంటూ వచ్చారు. అయినప్పటికీ ఆయనపై పార్టీ శీతకన్ను వేసింది. పరసాకు మద్దతుగా వేనాటి వారు పూర్తిస్థాయిలో టికెట్ కోసం ప్రయత్నించకపోవడం కూడా ఆయనకు మైనస్‌గా మారింది. దీంతో పరసాకు అధిష్టానం టికెట్ విషయంలో మొండిచేయి చూపింది. కనీసం తన కుటుంబ సభ్యులకైనా పార్టీ టికెట్ ఇవ్వాలని కోరినప్పటికీ అధిష్టానం పట్టించుకోకపోవడం విశేషం. ప్రస్తుత పరిస్థితుల్లో పరసా వెంకటరత్నం రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ విధేయుడంటూ పేరు తెచ్చుకున్న పరసా తన కుమార్తె అసమ్మతి గళాన్ని ఎందుకు అదుపు చేయలేకపోయాడని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ప్రస్తుతం పరసా దారెటు అనేది వేచి చూడాల్సిందే.

## మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరి, కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మార్చి 3వ తేది జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నట్లు తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడి సిబ్బందితో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ పర్యవేక్షణలో జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 3వ తేది 23 రూట్లలో 207 పల్స్ పోలియో బూతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు మూడవ తేది ఏర్పాటు చేస్తున్న బూతులలో పల్స్ పోలియో వేయబడునని, అదే విధంగా 4.5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పరిశీలించి ఇంకా ఎవరైనా 5 సంవత్సరాల లోపు పిల్లలకు మూడవ తేది ఏర్పాటు చేస్తున్న బూతులలో పల్స్ పోలియో వేయబడునన్నారు. ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డిఐఓ శ్రీనివాస రెడ్డి, డిపిఎంఓ శ్రీనివాసులు, యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు మోహన్, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కలు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## చాపకింద నీరులా టిడిపి ప్రచారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం ప్రచారం చాపకింద నీరులా సాగుతుంది. అంతేకాకుండా ఊరందూరు కేంద్రంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతున్నారు. ఇటీవల పార్టీలో మళ్ళీ చేరిన నాయకులు గుట్టుచప్పుడు కాకుండా గ్రామాలకు వెళ్ళి మద్దతు దారులను పార్టీలో చేర్చటానికి ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలంపై నాయకులు పూర్తి దృష్టి పెట్టారు. మొదటి నుంచి తెలుగుదేశంకు పునాదిగా ఉన్న శ్రీకాళహస్తి మండలంలో 46 పంచాయతీలు, 67 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ మండలంలో తెలుగుదేశం పార్టీకి హేమా హేమీలున్నారు. ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా పట్టు ఉన్న తాటిపర్తిఈశ్వరరెడ్డి, ఆయన కుమారుడు తాటిపర్తి రవీంద్రారెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్లు చెలికం పాపిరెడ్డి, రంగినేని చెంచయ్యనాయుడులున్నారు. ఇక జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డిలు ఎవరికి వారు ఉదయం ఊరందూరులో వ్యూహ ప్రణాళిక రచన తరువాత గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి వెళ్ళి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. అయితే

### చేరికలకు రంగం సిద్ధం

కొందరు తెలుగుదేశం పార్టీలో చేరటానికి సిద్ధంగా ఉన్న రాబోవు విపత్తులు, పోలీసు కేసుల దృష్ట్యా 'ఎన్నికల కోడ, తేదుల ప్రకటన వచ్చిన తరువాత చేరటానికి 'సిద్ధం' అని చెబుతున్నట్లు పార్టీలో చర్చించుకుంటున్నారు.

### సామాజిక వర్గాలతో ఆత్మీయ సమావేశాలు:

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామం రాజకీయ వేదికగా మారింది. గత కొంత కాలంగా ఊరందూరులోని బొజ్జల గృహంలో మళ్ళీ రాజకీయ సందడి చోటుచేసుకుంది. ఉదయం 6గంటల నుంచే వారి ఇంటి వద్దసందడిచోటు చేసుకుంటుంది. వచ్చిన వారితో పలకరింపులు మొదట బృందమ్మ ప్రారంభిస్తున్నారు. వచ్చిన వారికి అల్పాహారాలు అందించుటకు ప్రత్యేకంగా వంటలవారిని ఏర్పాటు చేసుకున్నారు. ఇక గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఉన్నపుడు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ వర్గాలతో ఆత్మీయసమావేశాలు నిర్వహించే వారు. ప్రస్తుతం ఆయన వారసులు ఆయన సతీమణి ప్రణాళికా బద్దంగా వివిధ వర్గీయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందరికి భరోసా ఇస్తున్నారు. ఓ వైపు ఇంటి వద్ద బృందమ్మ వచ్చిన వారితో మమేకం అవుతుండగా నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు విస్తృతంగా ఇంటింటికి ప్రచారాల్లో తలమునకలై ఉన్నారు. బృందమ్మ, రిషితారెడ్డిలు ఎలాగైనా ఈ సారి విజయం సాధించాలనే లక్ష్యంతో పరుగులు తీస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొత్తగా ఫ్లెక్సీల రగడ చోటు చేసుకుంది. ఇటీవల తొట్టంబేడు మండలానికి చెందిన మాజీ జడ్‌పిటిసిని అభినందిస్తూ అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఎవరో కానీ వాటిని చించివేస్తున్నారు. చిన్న ఫ్లెక్సీని చించితే దానికంటే పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ వివాదాలు తెలుగుదేశం పార్టీలో దావానలంలా రగులుతుంది.

## వ్యర్థాల నిర్వహణపై అవగాహన

- పారిశుధ్య కార్మికులతో కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేయడంపై పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తామని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ వ్యర్థాల సెగ్రిగేషన్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పారిశుధ్య కార్మికులు వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని, దీనిపై కార్మికులకు దశలవారీగా శిక్షణ ఇచ్చి దృశ్య రూపంలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్మికులు వ్యర్థాలను సేకరించే స్థలంలోనే తడి, పొడిగా సేకరించి నగర పరిధిలో వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, డిఇ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, ఏఇలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం

- డిఐఓ డాక్టర్ రవిరాజు

ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య సమాజ ఆవిష్కరించడానికి పూనుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు పేర్కొన్నారు. పుల్లూరు క్రాస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆయన హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో 426 మంది వైద్య పరీక్షలు చేసుకొన్నారు. ఇందులో 160 మంది చక్కెర వ్యాధి పరీక్షలు, 24 మంది బిపి, నరాలు, కీళ్ళ నొప్పులకు సంబంధించి పరీక్షలు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజ్ సందీప్‌రాజు, డాక్టర్ గిరిధర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'దేశం' హయాంలోనే కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి

- రాష్ట్ర 'దేశం' కార్యనిర్వాహక కార్యదర్శి బీమినేని చిట్టిబాబు



పాలసముద్రం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే కుప్పం నియోజకవర్గానికి శ్రీశైలం ప్రాజెక్టు నుండి బ్రాంచ్ కెనాల్ ద్వారా నీరు తీసుకువచ్చే పనులు తెలుగుదేశం ప్రభుత్వం దాదాపు పూర్తి చేసిందని రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి బీమినేని చిట్టిబాబు పేర్కొన్నారు. పాలసముద్రం మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో 630 కిమీ, 87 శాతం పనులు పూర్తి చేస్తే ఈ నాలుగేళ్ళుగా 13 శాతం పనులు పూర్తి చేసి మొత్తం వైకాపా ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గం పులివెందులకు నీళ్ళు తెచ్చిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు.

## పోలియో చుక్కలు విజయవంతంకు పిలుపు

పాలసముద్రం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
మార్చి 3వ తేదీ నిర్వహించనున్న పోలియో చుక్కల కార్యక్రమంను విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ మోహన్‌కృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పోలియో చుక్కల కార్యక్రమంపై ఎఓ విద్యావతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మెడికల్ ఆఫీసర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుండి మూడు రోజుల పాటు పోలియో చుక్కల కార్యక్రమం వుంటుందన్నారు. మార్చి 3వ తేదీ పోలియో చుక్కల కేంద్రాల్లో పిల్లలకు చుక్కలు వేస్తారని మిగిలిన రెండు రోజులు సిబ్బంది చుక్కలు వేసుకోని వారిని గుర్తించి వేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలో 19 పోలియో చుక్కల కేంద్రాలు, ఒక సంచార పోలియో చుక్కల బృందంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఎంఇఓ-2 గిరిజ, డిప్యూటీ తహసిల్దారు కిరణ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

**గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లి మామిడి తోపులో సోమవారం రాత్రి అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి హత్యకు గురి కావడం మండలంలో సంచలనం రేపింది. స్థానిక ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ఈ ప్రదేశంలో మద్యం సేవించి పథకం ప్రకారం హత్య చేసినట్లు గుర్తించామని, ఇతను వయసు 30,35 మధ్య వయసు కలిగి వుండి. సిమెంట్ కలర్ ప్యాంటు, రజనీకాంత్ బొమ్మ కలిగిన టీ షర్టు ధరించి వున్నాడని తెలిపారు. ఆచూకి తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన అన్నారు.అలాగే ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు డిఎస్పి రాజగోపాల్ రెడ్డి, సిఐ విశ్వనాథ రెడ్డి, ఎఐలు రామాంజనేయులు, వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వర్‌రావు ,డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఫోరెన్సిక్ సిబ్బంది ఐడి సిబ్బంది రంగంలోకి దిగి దీనిని చాలెంజ్‌గా తీసుకొని దరాప్తు సాగిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని మృతుని శవాన్ని పంచనామా నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎన్నికల విధులపై ప్రత్యేక దృష్టి : .జెసి

చిత్తూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
ఎన్నికల సజావు నిర్వహణకు ఇఆర్‌ఓలు, నోడల్ అధికారులు వారికి నిర్దేశించిన విధులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు.

## అబద్ధాల మాంత్రికుడు సిఎం జగన్‌రెడ్డి

- తెదేపా పరిశీలకుడు ఖాదర్ బాషా



కుప్పం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
సిఎం జగన్‌రెడ్డి అబద్ధాల మాంత్రికుడు అని కుప్పం తెదేపా పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా ఆరోపించారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక 18వ వార్డులో కరపత్రాలు పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా సృష్టికర్త దివంత ఎన్టీఆర్ అన్న విషయం అందరికీ తెలుసన్నారు. 2015లో సిఎంగా చంద్రబాబునాయుడు హం ద్రీ-నీవా కాలువల నిర్మాణం కోసం 463కోట్లతో పనులు చేపట్టగా 2019 ఎన్నికల నాటికి 87శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అయితే ఎన్నికల ప్రచారం కోసమే కృష్ణాజలాల ప్రారంభోత్సవ నాటకంను సిఎం జగన్ నిర్వహించారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, నేతలు అన్సర్, ఇమ్రాన్, ముజీబ్, ఖాసీం, జాలు, రఫీ, ఫజల్, జావిద్ పాల్గొన్నారు.

## తెదేపా ప్రభుత్వం హయాంలోనే హంద్రీ-నీవా పనులు

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



రామకుప్పం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే హంద్రీ-నీవా కాలువ పనులు 87శాతం పూర్తయ్యాయని మిగతా పనులు పూర్తిచేయకనే సిఎం జగన్‌రెడ్డి తమ ప్రభుత్వ పాలనలో కృష్ణాజలాలు అందిస్తున్నామని చెప్పడం హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం అంటే చంద్రబాబు నియోజకవర్గమన్నారు. 35 ఏళ్లుగా ఇక్కడ చంద్రబాబు చేసిన అభివృద్ధే కన్పిస్తోందన్నారు. కుప్పంలో తాము అభివృద్ధి చేశామని సిఎం జగన్‌రెడ్డి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లేనన్నారు. కుప్పానికి, పులివెందులకు ఎంత నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, ఆంజనేయరెడ్డి, రామూర్తి, మనోహర్, రామలింగారెడ్డి, రఫీ, సుబ్రి, వెంకటరమణ, సురేష్, పద్మమ్మ, అలివేలు మంగమ్మ, రాణెమ్మ పాల్గొన్నారు.

## పేదలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమి లేదు



ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమి లేదని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలేనని జాతీయ బిజెపి కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర పేర్కొన్నారు. మండలంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పోరు యాత్రలో రాజేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రేషన్‌కార్డుదారులకు అందిస్తున్న 5 కేజీ బియ్యం కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని, అయితే దీనిని రాష్ట్ర ప్రభుత్వం తాము అందిస్తున్నట్లు ప్రచారం చేసుకొంటోందన్నారు. ఇళ్ళ నిర్మాణాలు, అంగన్‌వాడీలకు అందిస్తున్న పౌష్టికాహారం కేంద్ర ప్రభుత్వం అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తాము పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం చేసుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మునినాథం, సుధాకర్, వెంకటేష్‌యాదవ్, వేణుగోపాలచ్చారి, తులసమ్మ, గోవిందరాజులు, కరుణాకర్, రాధాకృష్ణ, జగదీశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దేశం అభ్యర్థి గురజాల విజయానికి కలసికట్టు కృషి

- అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వారిని ఒకే తాటిపై తెచ్చిన ఎమ్మెల్సీ



చిత్తూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
చిత్తూరు అసెంబ్లీ స్థానం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గురజాల జగన్మోహన్ నాయుడు విజయానికి కలసికట్టుగా పని చేస్తామని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించిన మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా 'దేశం' ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, బిసీ నాయకులు సిఆర్ రాజన్‌లు పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ రామ్‌భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు నేతృత్వంలో ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన అభ్యర్థులు ఏకమై అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు సమక్షంలో ఆయన విజయానికి కలసికట్టుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వెంకిటేల సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి ప్రజాపోరు

- రాష్ట్ర బిజెపి ఎన్నికల కమిటీ సభ్యులు చిట్టిబాబు కొల్లా



చిత్తూరురూరల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను భారతీయ జనతా పార్టీ ప్రజా పోరు కార్యక్రమం ద్వారా ప్రశ్నిస్తున్నట్లు రాష్ట్ర బిజెపి ఎన్నికల కమిటీ సభ్యులు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. మంగళవారం గిరింపేట, అంబేద్కర్ సర్కిల్ వద్ద గిరింపేట మండల అధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో ప్రజా పోరు యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా నరేంద్రమోడి ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజానీకం కోసం వికసిత భారత్ సంకల్పంతో గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ రైతుసమ్మాన్ నిధి, మాతృవందన యోజన, చిన్నపిల్లలకు పోషణ్ అభియాన్, చేతివృత్తుల పనివారికి విశ్వకర్మయోజన, యువతకు అగ్నివీర్ తదితర సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తూ యువతకు జాబ్ క్యాలెండర్ ఉద్యోగాల కల్పన, ఉద్యోగస్తులకు సిపిఎస్ రద్దు, మద్యపాన నిషేదం, ఉచిత విద్యుత్ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపోరు కన్వీనరు సి.బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌నాయుడు, సంతపేట, సెంట్రల్ మండల అధ్యక్షులు రామభద్ర, షణ్ముగం, రూరల్ అధ్యక్షులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

## గంగాధర నెల్లూరులో ఎగరనున్న టిడిపి జెండా



గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:
వైఎస్ఆర్సిపి కంచుకోటగా వున్న గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని వేపంజేరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆర్ గాంధీ అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను చెన్నై ఎయిర్ పోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియూజకవర్గంలో తనకంటూ ఓ వర్గం ఉందని, వారి ద్వారా టిడిపి అభ్యర్థి థామస్ అత్యధిక మెజారిటితో గెలిపించి మీకు బహుమతిగా అందిస్తానని హామీ ఇచ్చానని తెలిపారు.

## సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

- తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం



కుప్పం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి పథకాల గురించి వివరించాలని తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కుటుంబ సాధికార సారథులుగా ఎన్నికైన వారికి సూపర్ సిక్స్ పథకాలపై శిక్షణ కల్పించారు. తెదేపా అధికారంలో రాగానే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, 18-59 ఏళ్ల మహిళలకు ప్రతినెలా రూ1500లు, తల్లికివందనం పేరిట చదివే ప్రతిపిల్లాడికి ఏటా 15వేలు, రైతులకు ఏటా 20వేల సాయం, నిరుద్యోగులకు ప్రతినెలా 3వేల నిరుద్యోగ భృతి తదితరాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, యశోదమ్మ, తిరుమగళ్, మహిళలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అందరి సహకారంతో విజయం సాధిస్తా

నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి కుటుంబ సభ్యులైన అందరి సహకారం తీసుకొని ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని తెలుగుదేశం పార్టీ శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, నాయకులను ఆమె కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సహాయం అందించి తిరిగి సూళ్లూరుపేట నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేసేందుకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నెలవల విజయశ్రీని ఘనంగా సన్మానించారు. పార్టీ యువత అధ్యక్షులు మేడా సాయినారాయణ మాట్లాడుతూ ఆమెను గెలిపించుకునేందుకు తెలుగు యువత కష్టపడి పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చిట్టేటి పెరుమాళ్లు, ఎజి కిషోర్, అలవల శ్రీనివాసరావు, పెంచలయ్య, చంద్రయ్య, పాముూరు మునుస్వామి, పోలూరు శ్రీనివాసులు, కె.శ్రీధర్, ఆలీ, మార్కండేయులు, బుజ్జయ్య, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బయ్యావారికండ్రిగ చెరువు పనులపై విచారణ చేయాలి

- రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు



కోట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
చిట్టమూరు మండలం యల్లసిరి రెవెన్యూ పరిధిలో ఉన్న బయ్యావారికండ్రిగలోని చెరువు పనుల్లో అవినీతి జరిగిందని, తక్షణమే ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయించాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం జలవనరుల శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి ఫిర్యాదు చేశారు. ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి సుమారు రూ.48లక్షల మేరకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆ కాంట్రాక్టర్ 23 శాతం తక్కువతో పనులు జరిపించి, పనులు చేయకుండా తనుకు అనుకూలంగా స్టేట్‌మెంట్లు మార్చి నాసిరకంగా పనులు జరిపించారని ఆరోపించారు. ఆ కాంట్రాక్టర్, ప్రస్తుత ఇంజనీర్ కలిసి ఫుల్ ట్యాంక్ లెవల్స్ తగ్గించి ఉన్న మట్టినే చదునుచేసి ఒక క్యూబిక్ మట్టిని కూడా తోలకుండా బిటి లెవల్ ఉన్నట్లుగా చూపించి రూ.10 లక్షల మేరకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం చెరువు పనులపై విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

## తిన్నెలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష



కోట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో మంగళవారం ఉప వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఇంటింటికి డాక్టర్ల బృందం వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.జగదీష్, సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు

## దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీ

**గూడూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**
గూడూరు పట్టణంలోని స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫల సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన రోటేరియన్ మూలీ, హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో ఎంతో తృప్తిగా ఉంటుందని ఇక ముందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వై. గోపాల్ రెడ్డి, ఆడిటర్ రామ్మోహన్ రావు, నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, రాఘవరెడ్డి, డివి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ కేంద్ర ప్రభుత్వం సబ్సీడీ లోన్ల పై అవగాహన



చిల్లకూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
చిల్లకూరు మండలం యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వం పథకాలు, అర్హులైన పేద వారికి ఇచ్చే సబ్సీడి లోన్లపై, జన్ ధన్ ఖాతాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా, అటల్ పెన్షన్ యోజన, డిజిటల్ లావాదేవీలు, విశ్వకర్మ యోజన లాంటివి బ్యాంకుల ద్వారా లబ్ధి పొందే వివిధ రకాల స్కీములపై ప్రజలకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా సెక్రటరీ బిందు రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్టుచే

అప్జల్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



గూడూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
గూడూరు పట్టణంలో ఈ నెల 26వ తేదిన పెయింటింగ్ వేస్తూ విద్యుత్ఘాతంతో మృతి చెందిన పఠాన్ అప్జల్ కుటుంబ సభ్యులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే 10,000 రూపాయిలు అంత్యక్రియల ఖర్చుల కోసం అందజేసారు. అప్జల్ పేద కుటుంబానికి చెందిన వాడని అప్జల్ ఒక్కరే ఆధారమని, భవిష్యత్తులో తన ట్రస్టు ద్వారా ఆ కుటుంబ సభ్యులకి తప్పకుండా సహాయం చేస్తామన్నారు. ఈ సమస్యని ట్రస్టు దృష్టికి తీసుకొచ్చిన శ్యామ్ రెడ్డికి అప్జల్ కుటుంబ సభ్యులకు సహాయాన్ని అందించిన ట్రస్ట్ సబ్యులు బాబు, భాస్కర్, శివాభి మస్తాన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## పారిశుద్ధ్వ పనులు చేయిస్తున్న ఉప సర్పంచ్ పాపారెడ్డి



వాకాడు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
మండల కేంద్రమైన వాకాడులోని మంగళవారం పాతదళితవాడలో సర్పంచి పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో కాలువ మరమత్తుల పనులు చేయించారు. ఈ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో చెత్త చెదారం పేరుకొని పోయి ఉండడంతో దోమలు విపరీతంగాఉన్నాయి.ప్రజలఅష్టకష్టాలుపడడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. పారిశుద్ధ్య కాలువ పనులు మరమ్మత్తులు ఉపసర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి సొంత నిధులతో చేయించారు. ఆయన వెంట పంచాయితీ సిబ్బంది భీమేశ్వరరావు ఉన్నారు.

## వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కలిసిన డాక్టర్ మస్తాన్ యాదవ్



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
రాజ్య సభ సబ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేసారు. తెలుగుదేశం పార్టీలోకిరావాలనిఆయనసాధారణంగావీపిఆర్‌ని ఆహ్వానించారు.ఆయన వెంట నాయ కులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ఓట్ల తొలగింపుపై అబద్ధపు ఫిర్యాదు చేస్తే చర్యలు



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
ఓట్ల తొలగింపు పై అబద్ధపు ఫిర్యాదు చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సాంబశివరావు తెలిపారు. వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నిజంగా భోగస్ ఓటర్లు ఉంటే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే తొలగిస్తామని తెలిపారు. బోగస్ ఓటర్ లేకుండా ఫిర్యాదు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను పారదర్శకంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుందని తెలిపారు. ఓటింగ్ అంచనాలపై ఎలాంటి అపోహాలు వద్దని చెప్పారు. 80 సంవత్సరాలు నిండిన వృద్ధులు 40 శాతం దివ్యాంగుల కోవిడ్ వ్యాధి భారిన పడి లేవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటిలోనే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని వివరించారు. రాజకీయ పార్టీ నాయకులకు పలుసూచనలు,సలహాలు ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ వెంకటరామయ్య, ఎన్నికల డిటి యువరాజ్, సిపిఐ నాయకుడు చంగయ్య, టిడిపి నాయకులు మచ్చల వేణు, సుధాకర్ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రాల్లో మాఫియా రాజ్యమేలుతోంది

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
వైసిపి ప్రభుత్వంలో ఇసుక మద్యం మైనింగ్ మాఫియా ఎక్కువగా జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. ఏడవ వార్డు ఎన్టీఆర్ కాలనీ కోళ్ల ఫారం ప్రాంతాల్లో ఆయన భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో మాఫియా ఎక్కువగా ఉందని విమర్శించారు. మాఫియా ద్వారా వైసిపి నేతలు కోట్ల రూపాయల సంపాదించుకుంటున్నట్లు చెప్పారు. ఏడో వార్డులో ఎలాంటి అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు విమర్శించారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూరిటీ కరపత్రాలను ఆయన పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ పి. రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ కౌన్సిలర్ పి. విశ్వనాథం, నాయకులు సత్యనారాయణ, నరసింహులు, చంద్రారెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్ నియామకం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసారు. అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్ విధులు నిర్వహిస్తే ఇక్కడికి బదిలీ అయ్యారు. మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న వెంకట రామయ్య కృష్ణా జిల్లా పెడన మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## విఎస్ఆర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం



గూడూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త
గూడూరు రెండవ పట్టణంలోని విఎస్ఆర్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చదనం - పరిశుభ్రత, చెట్ల ప్రాముఖ్యత, పరిరక్షణ గురించి అవగాహన కల్పించడానికి విద్యార్థుల చేత మొక్కలను నాటించారు. గూడూరు పట్టణంలోని నర్సింగరావు పేటలోని ప్రతి ఇంటికి విద్యార్థులు వెళ్ళి చెట్లు పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఇంటింటికి మొక్కనుఅందజేసారు.ఈకార్యక్రమానికిముఖ్య అతిధులుగా డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ శాంతిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నందిమండలంబాలకృష్ణ,అన్నపూర్ణ,ప్రిన్సిపాల్‌శాంత కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రన్నతోనే మహిళల సంక్షేమం

తెదేపా అభ్యర్ధి పాశం సునిల్ కుమార్

కోట,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త
వైకాపా ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేసి ఐదేళ్ల పాలనను ,ఆరాచక పాలనగా సాగించారని గూడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాశం సునిల్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి కోట పట్టణంలో ఆయన బాబు ష్యూరిటి.భవిష్యత్ గ్యారెంటే కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటి తిరుగుతూ వైకాపా మోసాలను ప్రజలకు వివరించారు. 5కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటే ఇస్తూ తెలుగుదేశం పార్టీ హామీలుగా ఇవ్వడం జరుగుతోందన్నారు. గతంలో తాను శాసన సభ్యులుగా చేసిన పనులే కనబడుతున్నాయన్నారు. సునిల్‌కుమార్‌కు కోటలో పూల వర్షం కురిపిస్తూ అందరికి అభివాదం చేస్తూ ముందుకు కదలారు. ఆయన వెంట మండల కన్వీనర్, ఎం.సర్వోత్తమ్ రెడ్డి, పలగాటి భాస్కర్ రెడ్డి, వెంకనపాళెం సర్పంచ్ మధు యాదవ్, జీలీల్ ఆహ్మద్, తీగల సురేష్‌బాబు, వాకా విజయ భాస్కర్ రెడ్డి, మస్తాన్‌బాష,కోట పట్టణ అధ్యక్షులు షంషద్దీన్,తూపిలిరాధకృష్ణారెడ్డి, చెంగల్‌రాయుడు, కందల భాలకృష్ణ, మద్రిపోలయ్య, మద్రిఅనిల్, జితేంద్రరెడ్డి,నౌషాద్,తదితరులు పాల్గొన్నారు

## రేషన్ బియ్యం పట్టివేత ...



నాయుడుపేట టౌన్ 27 ప్రభాతవార్త ;
నాయుడుపేట పట్టణంలోని మల్లాం జంక్షన్‌వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరళిస్తున్న రేషన్‌బియ్యం లారీని డిఎస్‌ఓ రాజారగువీర్ తనసిబ్బందితో కలిసి మంగళవారం పట్టుకున్నారు.ఆలారీలో పరిశీలించగా 500బస్తాలు రేషన్‌బియ్యం ఉన్నట్లు ఆయన గుర్తించారు.వాటి విలువ సుమారు పదిలక్షలు ఉంటుందన్నారు.దొరవారిసత్రం నుండి నెల్లూరుకు తరళిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఆరేషన్‌బియ్యం లారీని సేజ్‌చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు.నాయుడుపేట పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బొజ్జల ఇలాకాలో పవిత్రారెడ్డికి ఘనస్వాగతం

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు ఎస్టి కాలనీ, మద్దిలేడు గ్రామాల్లో ఎంఎల్ఏ బియ్యపుమధు సూధన్‌రెడ్డి కుమార్తె బియ్యపుపవిత్రారెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు గడపగడపలో ఘనస్వాగతం పలికారు. ఊరందూరు ఎస్టీ కాలనీ మద్దిలేడు గ్రామాల్లో పవిత్రారెడ్డికి అడుగడుగునా మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. గత ఐదేళ్ళుగా జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జగనన్న లక్ష్యమని అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా రుణాలు మాఫీ చేశారని మహిళల రక్షణ కోసం దిశ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. నేడు ఎన్నికలు రాగానే కొందరు నాయకులు వచ్చి ప్రచారాలు చేస్తారని మిగిలిన రోజుల్లో కనుమరుగైపోతారన్నారు. అందుబాటులో ఉండే తన తండ్రి బియ్యపుమధుసూధన్‌రెడ్డి చేసిన సేవా క్యార్యక్రమాలే ఆయన్ను గెలిపిస్తాయని ఆయనకు ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు.మండల అధ్యక్షులువయ్యాలకృష్ణారెడ్డి, వైస్ఎంపిపి భానుయాదవ్, అమాసచంద్రశేఖర్‌రెడ్డి, కాపిరెడ్డివిజయభాస్కర్‌రెడ్డి పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## రాయలసీమ అభివృద్ధికి మార్గం తిరుపతి రాజధాని



### మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

రాయలసీమ ప్రాంతం సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఏకైక మార్గం తిరుపతి రాజధాని అవ్వాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం నుండి తిరుపతి వరకు దాదాపు 300 కిలోమీటర్ల మేర ఎత్తైన కొండలు, రాళ్లు తప్ప ఇంకేమీ కనబడడం లేదని 70 స్వతంత్రాల కాలంలో నీలం సంజీవరెడ్డి మొదలుకొని ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి వరకు రాయలసీమ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ వేల కోట్లు వెనకేసుకుని హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో హాయిగా బతుకుతున్నారన్నారు. రాయలసీమలో పేదరికం పోవాలన్నా, పేదల ఆకలి తీరాలన్న ప్రజలందరూ సమృద్ధిగా అభివృద్ధి చెందాలన్నా తిరుపతి రాజధాని అవ్వాలన్నారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి, తిరుపతి రాజధాని పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, శాంతి యాదవ్, మునిశోభ, జ్ఞానేద్ పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్, ఎంపిఎస్ నాయకుల సమావేశం విజయవంతం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



ఎంఆర్‌పిఎస్,ఎంపిఎస్ సమీక్ష సమావేశానికి తిరుపతికి విచ్చేసిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ఇర్లరాజ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎస్సీ వర్గీకరణపై జరిగిన సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా మాదిగ సోదరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న మందకృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ గురించి అలాగే రాబోవు కాలంలో పార్టీ కార్యాచరణ గురించి చర్చించారు. అనంతరం మందకృష్ణమాదిగను భారీపూలమాలతో సత్కరించి శివయ్య ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి యువసేన ఇన్‌ఛార్జి ఈశ్వర్‌మాదిగ, పట్టణ అధ్యక్షుడు వెంకటమునిమాదిగ, సీనియర్ ఎంఆర్‌పిఎస్ నాయకులు విష్ణుమాదిగ, శివమాదిగ, బాలరాజుమాదిగ, ఉదయ్‌మాదిగ, మధు, శ్రీను, శశి తదితర నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఐడియా సృష్టించింది సిఎం జగనన్నే

### బియ్యపు పవిత్రరెడ్డి



ఏర్పేడు,ఫిబ్రవరి27,ప్రభాతవార్త;

రాష్ట్రాభివృద్ధికి ఒక ఐడియా సృష్టించింది మన ముఖ్యమంత్రి జగన్మహన్‌రెడ్డి మాత్రమే నని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయ పవిత్రరెడ్డి పెర్కొన్నారు. మంగళవారం మండలంలోని మోదుగులపాళెం గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుకు 14 ఏళ్ళు చాన్స్ ఇచ్చి, జగనన్నకు 5ఏళ్ళు చాన్స్ ఇచ్చి ఇద్దరికి కంపారిజం చూపిస్తే ఎలా, చంద్రబాబుకు వడ్డించిన విస్తరి, జగనన్నను ఏమిలేని దగ్గర వదిలి ఇద్దరికి సరిపోల్చడం సరికాదు. జగనన్నకు మళ్లీ చాన్స్ ఇవ్వాలి, జగనన్న గడచిన 57 నెలల పాలనలో సచివాలయ వ్యవస్థ ఐతేనేమి, ఆడపిల్లల స్కూల్లో వసతులైతేమి, వాలంటీర్ల వ్యవస్థ, ఇంటివద్దకే పింఛను, ఇంటివద్దకే రేషన్, నాడు,నేడు ద్వారా స్కూల్ అభివృద్ధి ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఐడియాలతో రాష్ట్ర అభివృద్ధికి జగనన్న పాటు పడుతుంటే ఇప్పుడు మేము చేస్తామని తెదేపా చెపుతుంటే ప్రజలకు నవ్వొస్తుందన్నారు. పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ఏర్పేడు మండల ప్రజలు సిద్ధం కావాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా మోదుగులపాళెం గ్రామంలో టిడిపి నుంచి మళ్లీ సొంత గూటికి చేరుకున్న ఎక్స్ సర్పంచిమేర్లపూడి మురగప్ప మొదలి,శ్రీనివాసులు మొదలి, ఊసిబాబు, చింతలచేరి సుందరయ్య, బిల్లు రాంబత్తెయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు.

## పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన సదస్సు

ఏర్పేడు, ఫిబ్రవరి2, ప్రభాతవార్త;

మండలంలోని మడిబాక గ్రామంలో త్రీ ఎఫ్ ఆయిల్ ఫామ్ కంపెని వారు పామాయిల్ తోటల పెంపకంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కంపెనీ ఏజీఎం మురళి మాట్లాడుతూ రైతులు పామాయిల్ తోటలను చేపట్టే రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, తోటలపెంపకానికి అయ్యే ఖర్చులు, పంట దిగుబడులు, ఆధాయం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. పామాయిల్ తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారిణి పుష్పలత 77995086968, ఫోన్ ద్వారా సంప్రదించాలని రైతులను కోరారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ అధికారి గురునాధం, మేనేజర్ రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాపానాయుడుపేటలో రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు పంపిణి

ఏర్పేడు, ఫిబ్రవరి27,ప్రభాతవార్త;



ముఖ్యమంత్రి జగన్మోన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పేద"లందరికి ఇల్లు కార్యక్రమం ద్వారా జగనన్న కాలనీలో లబ్ధీ పొందిన లబ్ధీ దారులకు పాపానాయుడుపేట సచివాలయం నందు మంగళవారం సర్పంచి లలితా కరుణాకరన్ లబ్దీ దారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి హరికృష్ణ, వి ఆర్వో జయపాల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలిసిన సత్యవేడు తెదేపా ఇన్‌ఛార్జ్

సత్యవేడు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను సత్యవేడు ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత, నియోజకవర్గ పరిశీలకులు చంద్ర శేఖర్ మంగళవారం చెన్నై విమానాశ్రయంలో కలి శారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలి పారు. ఈసందర్భంగా రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించే దిశగా కృషి చేయాలని, అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించి, తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టనున్న కార్యక్రమాలను తెలపాలని ఆయన సూచించినట్లు వారు తెలిపారు.

## బలవంతపు నగదు వసూళ్లపై తల్లిదండ్రుల ఆగ్రహం..!

నారాయణవనం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోల సమావేశం కోసం 6నుంచి10 వరకు చదువుతున్న విద్యార్థులు ఒక్కొక్కరిని నుంచి 100నుంచి200 వసూళ్ల చేయాలని రెండు రోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేసుకొని నిర్ధారించుకున్నారు. ఆ మేరకు ప్రతి తరగతి నుంచి విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్ల కోసం ఆయా క్లాసు టీచర్లను నియమించారు. దీంతో గత రెండు రోజులుగా బాధ్యత తీసుకున్న టీచర్లు విద్యార్థుల నుంచి ఆ మేరకు నగదు వసూళ్ల చేస్తున్నారు. ఎవరైనా విద్యార్థులు డబ్బులు ఇవ్వకపోతే క్లాస్ రూంలోనే టీచర్లు బూతులు తిడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. విద్యార్థుల తల్లితండ్రుల దృష్టికి ఈ సమాచారం వెల్లడంతో వారు మండిపడుతున్నారు. విద్యార్థుల నుంచి బలవంతపు వసూళ్ల చేయడం పద్ధతికాదని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ ఖండించారు.

## నిరుపేద కుటుంబానికి సిపాయి భరోసా

రేణిగుంట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం దిగువ మల్లవరం గ్రామానికి చెందిన బాబ్జి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం మంగళవారం పరామర్శిం చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యుల కుతన సహాయసహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. మృతుని భార్య సుమతికి సిపాయి భరోసా ద్వారా 42 రకాల నిత్యావసర సరకులను ఆరు నెలలకు సరిపోయే విధంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు చెంగయ్య, మునెమ్మ, గుర్రమ్మ, కోదండపాణి, చంద్రయ్య, చెంగమ్మ, శాంతి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోశాలకు పశుగ్రాసం వితరణ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న గోశాలకు మంగళవారం ఒక ట్రక్కు పశుగ్రాసాన్ని వితరణగా అందించారు.ఆలయంలో నిర్వహిస్తున్న పథకాల్లో సమర్థవంతంగా నిర్వహిస్తున్న పథకం గోశాల ఒకటి ఇక్కడ సుమారు వేయ్యికి పైగాపశువులున్నాయి. వాటి నిర్వహణకు ప్రత్యేకంగా లోబావిలో గోశాలను ఏర్పాటు చేసారు.తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన నాగవరపు వెంకటయ్య, నాగవరపు మాధవరావులు గోశాలకు పశుగ్రాసాన్ని అందించారు.ఈ వితరణను వారు ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా అందించారు.ఈ కార్యక్రమాల్లో గోశాల ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి,నాగవరపు వెంకటయ్య, సిద్దులయ్యలు పాల్గొన్నారు.దాతలకు చైర్మెన్ శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు.

## మార్చి 9 నుంచి తొండమాన్‌పురం స్వామి బ్రహ్మోత్సవాలు

### గోడపత్రికలను ఆవిష్కరణ



శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వం స్వామి ఆలయంలో మార్చి 9 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కార్యక్రమాలకు సంబంధించి గోడపత్రికలు,కరపత్రాలను ఆలయ డెప్యూటీ ఇఒ జి.దేవేంద్రబాబు ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం ఆలయం ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా దేవేంద్రబాబు మాట్లాడుతూ దిన దినాభివృద్ధి చెందుతున్న తొండమాన్‌పురం ఆలయాభివృద్ధికి టిటిడి ఇతోధిక సేవలందిస్తుందన్నారు. శ్రీకాళహస్తి తొండమాన్‌పురంలో వెలసిన స్వామి చారిత్రాత్మక ప్రాధాన్యత కల్గి ఉన్నారన్నారు. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన తొండమాన్ రాజు నిర్మించినట్లు ఆధారాలున్నాయని వివరించారు.ఇటీవల కాలంలో ఆలయాభివృద్ధికి టిటిడి చైర్మెన్ కరుణాకర్‌రెడ్డి చొరవ చూపుతున్నారన్నారు. ఆలయాల అభివృద్ధికి గతంలో కూడా ఆయన ఎంతో కృషి చేసారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ ఆర్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవండి

.తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు భరత్‌రెడ్డి పరీక్షా సామగ్రిని పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పదోతరగతి ఎంతో కీలకమైందన్నారు. ఈతరగతిలోనే విద్యారర్థులు తమ భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇందుకు ఉత్తమ ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. ఏవిద్యార్థి అయినా లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే తల్లిదండ్రులు కలలను సాకారంచేయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సిపిఎం నాయకుడు రాపూరుసుబ్రమణ్యం, హేమంత్, వరప్రసాద్, ప్రవీణ్, మనోజ్, శ్రీనివాసులు, నాగరాజు, భాను, మోతీష్, రవి, సిద్దు, లితీష్, రాజు, గణేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## 1న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

తొట్టంబేడు మండల సర్వ సభ్య సమావేశం మార్చి 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ పి.ఐసాక్ ప్రవీణ్ తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అన్నిశాఖల అధికారులు హాజరవ్వాలన్నారు. వివిధ సమస్యలపై సభ్యులు చర్చించవచ్చని తెలిపారు.

## పెద్దకన్నలి ఎస్సీకాలనీలో నీటి సమస్య పరిష్కారం

తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



మండలంలోని పెద్దకన్నలి ఎస్సీ కాలనీలో త్రాగునీటి బోరు మూడు నెలల క్రితం మరమ్మత్తులకు గురికావడంతో దానిని మరమ్మత్తులను చేయాలని అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని దీంతో సమస్యను బొజ్జలసుధీర్‌రెడ్డికి తెలియజేయడంతో స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో త్రాగునీటి బోరుకి కొత్త పైపులు మరియు మోటార్‌ను బిగించారు. దీంతో స్థానికుల దాహార్తిని తీర్చిన తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, నాయకుడు ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని సుధీర్‌రెడ్డి తెలిపారు.

## మృతురాలికి బృందమ్మ నివాళులు

.తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో నివాసం ఉంటున్న దేగపూడి సరస్వతి మృతిచెందడంతో విషయం తెలుసుకున్న బొజ్జలబృందమ్మ గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికిపూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆమె మృతు రాలి కుటుంబ సభ్యులను ఓదార్చడంతో పాటు తాము కుటుంబానికి భరోసాగా ఉంటామ న్నారు. ఆమెతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మురళీనాయుడు,బాబు,బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికలకు ముందే మొదలైన ఫ్లెక్సీల రగడ

.తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవర్త

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఫ్లెక్సీల రగడ నియోజకవర్గంలో మొదలైంది. మండలంలోని కొత్తకండ్రిగ గ్రామం తెలుగుదేశంపార్టీకి కంచుకోటగా ఉంది. ఈ గ్రామానికి మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు మీకోసం పాదయాత్రలో భాగంగా ఈ గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ జడ్పీటిసి పన్నీరుకాల్వవెంకటాచలం ఇంట్లో పల్లెనిద్రచేశారు. ఇక గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం విదితమే. ఈనేపధ్యంలో తెలుగుదేశంపార్టీలో ఉన్న వెంకటాచలం ఇటీవల కొన్ని కారణాల వల్ల అధికారపార్టీ వైకాపాలో చేరారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఇక్కడి గ్రామంలో తెలుగుదేశంపార్టీకే అధిక్యత చోటుచేసుకుంటుంది. అయితే ఇటీవల మాజీ జడ్పీటిసి వెంటాచలం తిరిగి ఇటీవల విజయవాడలో చంద్రబాబునాయుడు సమక్షంలో మాతృపార్టీ అయిన తెలుగుదేశంపార్టీలో చేరారు. ఆయనతో పాటు తొట్టంబేడు జడ్పిటిసి అర్చనాదేవి, పూడి మాజీ సర్పంచ్ మునిరత్నంలు తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో గ్రామంలోని వెంకటాచలం అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బైపాస్‌రోడ్డులోను, గ్రామంలోను ఫ్లెక్సీలు వేశారు. అయితే కొందరు ఇది గిట్టని వారు వీటిని చించివేశారు. అయితే రెండోసారి మరోసారి పెద్ద ఫ్లెక్సీలు వేశారు. వీటిని కూడా చించివేశారు. ఏది ఏమైనా సార్వత్రిక ఎన్నికలకు ముందే నియోజకవర్గంలో ఫ్లెక్సీల రగడ మొదలైందని చెప్పవచ్చును.

## టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు ఎస్ఐలు నియామకం

.తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు ఎస్ఐలను నియమించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న మహేష్‌బాబు పాకాలకు బదిలీ అయ్యారు. అనంతపురంలో పనిచేస్తున్న శివప్రసాద్, విజయభాస్కర్‌రాజులను నియమించారు.ఈమేరకు వీరు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ శివయ్య పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహించడానికి అవకాశం రావడం ఎంతో అదృష్టమని ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ఉన్నతాధికారులు సూచనల మేరకు విధులు నిర్వహిస్తామని శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు.

## కోడిపందెంరాయుళ్ళ అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త మండలంలోని కంచనపల్లి గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ రాఘవేంద్ర తమ సిబ్బందితో దాడిచేసి నలుగురు వ్యక్తులతో పాటు రెండు కోళ్ళు, రూ.1700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని కోర్టుకు హాజరపరచనున్నట్లు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## మార్చి 7 నుంచి రామగిరి శ్రీఅంకాలపరమేశ్వరీ అమ్మవారి కుంబాభిషేకం

పిచ్చాటూరు/నారాయణవనం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :



మార్చి నెల 7వ తేది నుంచి పిచ్చాటూరు మండలం రామగిరిలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీ అంకాల పరమేశ్వరీ అమ్మవారి ఊంజల్ మండపం ప్రారంభోత్సవ కుంభాభిషేకం కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రామగిరిలోని శ్రీ అంకాల పరమేశ్వరీ అమ్మవారి ఊంజల్ సేవ మండపంను సుమారు 60లక్షల రూపాయాల వ్యయంతో సెంగుందర్ కుదిరై వీరర్ కావక్కార్ మరియు బోయ సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. మార్చి 7వతేది గురువారం రాత్రి 11గంటలకు వాస్తుశుద్ధి, 8వ తేది శుక్రవారం ఉదయం 1.30గంటలకు పైగా కళశ స్థాపన అవాహన ప్రాణ ప్రతిష్ట, 3గంటలకు గణపతి హోమం, లక్ష్మీహోమం, ఉదయం 8.30గంటలకు మీన లగ్నంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాల ప్రాణావహనం చేసి ఊంజల్‌సేవను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఎంసిఆర్ చెప్పుల పంపిణీ

నారాయణవనం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :

నారాయణవనం మండలం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని కుష్టువ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఎంసిఆర్ చెప్పులను మంగళవారం అందజేశారు. ఈ చెప్పులను జిల్లా డిఎన్ఎంఓ డిఎల్ఎటిఓ డాక్టర్ రాజా వారి ఆధ్వర్యంలో అందజేశారు. అంగ వైకల్యం కలిగిన వారికి చెప్పులు అవసరమైతే వారికి ఏడాదికి రెండు విడతలుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దర్శిత్‌రాజ్, డాక్టర్ రాఘ సుధ,ఫిజియోథెరపిస్టు ఎస్‌వి రమణ, డిప్యూటీ డిఇఎంఓ కె కిరణ్‌కుమార్, సిహెచ్ఓ శ్రీనివాసులు, హెచ్ఇ రామచంద్రయ్య, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రసోక్తంగా శ్రీ ప్రత్యంగిరా హోమము

### వైభవంగా 15వ వార్షిక వేడుకలు



చంద్రగిరి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

తొండవాడ పంచాయతీలో వెలసియున్న శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళీ పీఠంలో పీఠాధిపతి సూరి స్వామి ఆలయ 15వ వార్షికోత్సవ ఉత్సవాలలో మంగళవారం శ్రీప్రత్యంగిరా హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేదపండితులు జి.సీతారామశాస్త్రి, కార్యనిర్వహకులు పూజారి శివశంకరప్రసాద్, వడికాసుల రామమూర్తి నాయుడు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి 10:00 గంటల వరకు అభిషేకము, 10 గంటల నుండి ప్రత్యంగిరా హోమము, కాలభైరవ హోమము, దశ మహావిద్య హోమము, మంత్రపుష్పం, నైవేద్యము, హారతి, తీర్థప్రసాద వినియోగము గావించారు.



## ప్రగతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం

### వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నట్లు వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దోర్నకంబాల పంచాయతీలో మంగళవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాటతప్పని మడమ తిప్పని నాయకుడుగా ముఖ్యమంత్రి ఎన్నికల హామీలలో మెజారిటీ శాతం నెరవేర్చారని అన్నారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించిన ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విశిష్ట సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో రాజకీయ ప్రవేశం చేసిన మా అన్నయ్య తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించాలని కోరారు.

## వైకాపా నుంచి టిడిపిలోకి చేరిక

యర్రావారిపాళెం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మండలంలోని కమలయ్యగారిపల్లి పంచాయతీ యనమలవారిపల్లికి చెందిన 30వైకాపా కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. జిల్లా తేదేపా అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో చేరిన వారందరికీ తేదేపా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పులివర్తి నాని గెలుపుకు కృషి చేస్తామని నూతనంగా పార్టీలో చేరిన వారన్నారు. యనమల నాగార్జునరెడ్డి, తెలగంశెట్టి సుబ్రమణ్యం, నాగిశెట్టి సుబ్రమణ్యం, శివయ్య, మురళి, బోగటాల శివయ్య, నాగరాజు, సుబ్రమణ్యం, గురుస్వామి, లోకేష్, శివశంకర్, ఈశ్వరయ్య, నరసింహులు, చంగ్రాయులు, తదితరులు పార్టీలో చేరిన వారిలో వున్నారు.

## పేదలకు స్థానికంగానే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### సిపిఎం నాయకులు డిమాండ్

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

పేదలకు స్థానికంగానే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేసారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి శెట్టిపల్లి పంచాయితీలో దాదాపు మూడువందల ఎకరాలు కబ్జాలకు గురైందన్నారు. కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని మంగళం ప్రాంతంలోని జగనన్న పట్టాదారులకు గతంలో కేటాయించిన స్థలంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. సుధూర ప్రాంతమైన శ్రీకాళహస్తి నియోజకవర్గం చిందేపల్లిలో స్థలాలు వద్దని స్థానికంగానే ఇవ్వాలని లబ్ధిదారుల అభిప్రాయమన్నారు. ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు వీరి జీవనం ఇక్కడే ఉన్నది. మంగళం ప్రాంతంలోని 2736 మంది పట్టాదారులకు స్థానికంగానే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ప్రభుత్వ భూమిలో దాదాపు 15 అడుగుల ఎత్తులో గ్రావెల్ మట్టిని తవ్వి అక్రమంగా సొమ్ము చేసుకున్నటువంటి అక్రమార్కులపై ఆర్‌డిఓ, సమగ్రమైన దర్యాప్తు చేపట్టి ఈ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి శెట్టిపల్లిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను బయటపెట్టాలన్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే అరెస్టులు,వైసిపినాయకులుకబ్జాచేస్తేమంగళహారతులుపడుతున్న రెవెన్యూ అధికారుల తీరును ఖండించాలన్నారు.

## మోదీ నాయకత్వంలోనే దేశం ముందడుగు

కేవీబీ పురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. పెనుబాల చంద్రశేఖర్ అధ్యక్షతన బీజేపీ కార్యకర్తల సమీక్ష సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ భారత దేశాన్ని కాపాడుకోవాలన్న బీజేపీ పార్టీని అభివృద్ధి పరచాలన్న ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలోని దేశం అన్ని రంగాల్లో ముందుకు నడుస్తుందని ప్రపంచ దేశాలు కూడా హర్షిస్తున్నాయన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వైసీపీ పాలన ప్రజలకు చేసిందేమీ లేదని బీజేపీ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన నొక్కి వక్కాణించారు. అనంతరం గ్రామాల్లోని ప్రజలతో బీజేపీ పార్టీ మోదీ ఉన్న క్యాలెండర్లను ప్రతి ఒక్కరికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్, జిల్లా పార్లమెంట్ నాయకులు వెంకటయ్య, వాసుదేవరావు, చంద్రబాబు, మండల స్థాయి జిల్లా స్థాయి నియోజకవర్గస్థాయి బీజేపీ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలోపాల్గొన్నారు.

## ఎన్‌సీసీ విద్యార్థులకు ఉన్నత విద్యకు ఉద్యోగావకాశం

కేవీబీ పురం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన మోడల్ స్కూలు కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం తిరుపతి ఎన్‌సీసీ సంబంధించిన ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ప్రకాష్, ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్ అధ్యక్షతన ఎన్‌సీసీ గురించి సమీక్ష సమావేశం జరిగింది. కమాండర్ ప్రకాష్ మాట్లాడుతూ ఎన్‌సీసీ గురించి వివరించారు. ఎన్‌సీసీ వల్ల విద్యార్థి దశలో ఆ సర్టిఫికెట్ రిజర్వేషన్లు అన్ని విరాళా ఉన్నత స్థాయి విద్యకు ఉద్యోగాలకు రిజర్వేషన్ ఉంటుందని అటువంటి ఎన్‌సీసీ అందరూ కూడా చేరాలని ఎన్‌సీసీని కూడా అవసరమైతే ఈ పాఠశాల ఏర్పాటు చేస్తామని ప్రస్తుతం ఎన్‌సీసీ 7 రోజులు 210 కి.మీ తిరగాల్సి ఉందని మొదటిగా సోమవారం ట్రిబుల్ ఐటీ ఏర్పేడులో కాళహస్తి తరువాత కేవీబీ పురం, బుధవారం పాలమంగళం నుంచి మంత్రి రోజా కార్యక్రమానికి వెళుతున్నామని ఈ మధ్యలో హార్సెస్ షోయింగ్‌కార్యక్రమాలు జరుగుతున్నాయని విద్యార్థుల అభివృద్ధి దృష్ట్యా హార్సెస్ షోకు ఏర్పాటు చేశామని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ కస్తూరిబా గాంధీ, ఎస్‌వో వారి విద్యార్థిని, విద్యార్థులతో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన హాస్టల్‌ద్వారా కొన్ని షోలు ప్రదర్శింపచేశారు. ఆయనతో పాటు ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీ వెట్టి సరస్వతి, రాజేష్, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్, కమాండర్స్,ఎన్‌సీసీస్టాఫ్ కస్తూరిబా గాంధీ స్కూలు సత్యావతి, ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జి ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,మోడల్‌స్కూలువిద్యార్థులు,వ్యాయామఉపాధ్యాయులుఫిరోజ్‌పాల్గొన్నా రు.

## ఉత్తమ విద్యార్థులకు అవార్డులు

తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థినులు 13 మంది ఉత్తమ విద్యార్థుల అవార్డులను స్వీకరించారు. నవ సమాజ ఫెడరేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థినులలో అత్యధిక మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. నారాయణమ్మ పాల్గొన్నారు. అవార్డులు స్వీకరించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ అభినందిస్తూ చదువు, తెలివితేటలు విద్యార్థినులకు ఉత్తమ మార్గంలో నడిపిస్తాయన్నారు. అత్యధిక మార్కులు సాధించిన ఈ విద్యార్థినులు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. విద్యతో పాటు విజ్ఞానం, వినయం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్తమ విద్యార్థినులుగా అవార్డు స్వీకరించిన వారిని చరిత్ర విభాగాధిపతి హేమలత, డా. భద్రమణి, హాస్టల్ వార్డెన్ డా. విద్యుల్లత, డా. ఉమారాణి, డా. కృష్ణవేణి, డా. అరుణ, డా. విజయకుమారి అభినందనలు తెలిపారు. ఇటువంటి అవార్డులను విద్యార్థినులు మరిన్ని సాధించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు. విద్యార్థినుల బృందం వీరికి శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఎస్వీయూ పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



తిరుపతి క్రీడా, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలక మండలి సమావేశం ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి కార్యాలయం నుండి ఉదయం 11 గంటల నుండి 2 గంట మధ్య జరిగిన సమావేశంలో అనేక అంశాలపై చర్చ నిర్వహించారు. అమరావతి నుండి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్ర రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్ర రెడ్డి, ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు ఆన్‌లైన్‌లో పాల్గొనగా, మిగిలిన పాలకమండలి సభ్యులు విసి కార్యాలయం నుండి పాల్గొన్నారు. పలు కీలక అంశాలకు పాలకమండలి ఆమోదం తెలిపినట్లు ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 53 మంది బోధన సిబ్బందికి సిఏఎస్‌కు సంబంధించిన పదోన్నతిపై చర్చ జరిగింది. పాలకమండలి ఆమోదం తెలిపింది. దీనితో వారు ఆచార్యులుగా, సహాచార్యులుగా పదోన్నతి పొందినట్లయిందన్నారు. విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది వయోపరిమితిని 60 ఏళ్ల నుండి 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో 10ని పాలకమండలి ర్యాటిఫికేషన్ చేసింది. పలు ఇంజనీరింగ్ పనులు, భవన నిర్మాణాలకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. కొన్ని నూతన కోర్సులకు సంబంధించి చర్చ జరిగిందన్నారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు వివిధ శాఖల్లో గోల్డ్ మెడల్ ఇవ్వడానికి దాతలు ముందుకు రావడంతో విశ్వవిద్యాలయం పక్షాన పలు గోల్డ్ మెడల్ ఇచ్చేందుకు ఇసి ఆమోదం తెలిపింది. అలాగే విశ్వవిద్యాలయ ఆర్థిక విషయాలను చర్చించేందుకు, పలు నిర్ణయాలు తీసుకునేందు ఒక ఆర్థిక సలహా మండలిని ఐదు మంది సభ్యులతో ఏర్పాటు చేయడం జరిగిందని ఆమోదించారు. పాలక మండలి సభ్యులు ఆచార్య సుగుణమ్మ, ఆచార్య పద్మనాభం, ఆచార్య సుమకిరణ్, డా.మంజుల, డా.మొహిద్దిన్ భాషా, డా.సంధ్యారాణి, డా.సురేంద్రనాథ్ రెడ్డి, నారాయణ బాబు, జ్యోతి పాల్గొన్నారు.

## వేమిరెడ్డిని కలిసిన చిల్లకూరు దశరధరామిరెడ్డి

**2న చంద్రబాబు సమక్షంలో చేరిక**



కోట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజ్యసభకు రాజీనామా చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని తిరుపతి జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి, చిల్లకూరు దశరాధ రామిరెడ్డి మంగళవారం వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అంద చేశారు. వారిద్దరిమధ్య ఉన్న సాన్నిహిత్య కారణంగా మార్చి 2న మాజీ సీఎం నెల్లూరు పర్యటన సందర్బంగా దశరాధరామిరెడ్డి వైకాపా గుడ్‌బై చెప్పి తెదేపాలో చేరనున్నారు. అదే బాటలో చెందోడు గ్రామానికి చెందిన వైకాపా యువ నాయకుడు తెదేపాలో చేరనున్నారు. వైకాపాలో కష్ట పడి పని చేసిన సరైన గుర్తింపు లేదని దశరాధ రామిరెడ్డి భావించారు. బలమైన ఓటు బ్యాంక్ కలిగిన దశరాధరామిరెడ్డి వైకాపా వీడతారని ప్రచారం జరగడంతో వైకాపాకి భారీనష్టం జరుగుతోందని వైకాపా శ్రేణులు మదనపడుతున్నాయి.

## అసంపూర్తిగా మండల పరిషత్ కార్యాలయ భవనం



బాలాయపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మండల కేంద్రమైన బాలాయపల్లిలో కోటి 60 లక్షల రూపాయిలు నిర్మించే మండల పరిషత్ భవన నిర్మాణ పనులు మూడు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతోంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆనం రామానారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సచివాలయంలో నిర్వహిస్తున్నారు. మూడూ సంవత్సరాలుగా కార్యాలయం పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కాంట్రాక్టరుకు బిల్లులు రానందున పనులు చేయడం లేదని తెలిసింది. కార్యాలయం విస్తారంగా లేనందున సిబ్బంది పనుల కోసం వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. త్వరితగతిన మండల పరిషత్ కార్యాలయం భవనం పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## చారాల వద్ద ఆటోలు ఢీ : ఆరుగురికి గాయాలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ప్రయాణీకులను తరలించే రెండు ఆటోలు ఢీకొనడంతో 6గురికి గాయాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు చారాల రెడ్డెమ్మదేవత ఆలయం వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గద్దంవారిపల్లికి చెందిన వెంకట్రమణ(53)తోపాటు మరో 5గురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ వెంకట్రమణను స్థానిక ఆసుపత్రికి తరలించగా, ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పుంగనూరు ఏరియా ఆసుత్రికి సిఫారస్సు చేసారు.

## కేంద్ర పథకాలను ప్రచారం చేసుకుంటున్న వైకాపా

**-బిజేపీ అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్.**



పెద్దపంజాణి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కేంద్రప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడి అమలు చేస్తున్న పలుపథకాలకు రాష్ట్రప్రభుత్వం తమ పథకాలుగా అమలుచేసుకుంటోందని పలమనేరు నియోజకవర్గ బిజేపీ అసెంబ్లీకన్వీనర్ విజయ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రపార్టీ పిలుపుమేరకు పెద్దపంజాణిలో ప్రజాపోరు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఉచితరేషన్ బియ్యాన్ని, ఆరోగ్యశ్రీ పథకాన్ని, రైతుభరోసా పథకాలను రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలుగా వైకాపా ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. ఈ పథకాలన్నీ కేంద్రం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి పథకాలకు కేంద్రంకూడా సాయం అందిస్తోందన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్కసారి కేంద్రంలో మరోసారి బిజేపీకి ప్రజలు అధికారం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్బంగా బట్టందొడ్డికి చెందిన వెంకట్రామిరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, కొలత్తూరు పంచాయతీకి చెందిన మసన్న, నరసింహులు, చలమంగళంకు చెందిన సహదేవ్, ముత్తుకూరుకు చెందిన కుమారస్వామి తదితరులు బిజేపీ తీర్థంపుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు అసెంబ్లీకో కన్వీనర్ ఉమాపతి, వి.కోట మండల బిజేపీ అధ్యక్షుడు సోమశేఖర్, ప్రజాపోరు ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, వెంకటరమణ, బంగారు రెడ్డి, నేతలు బాలసుబ్రమణ్యం, పాండురంగాచారి, ప్రభాకర్, యల్లారెడ్డి, పద్మనాభం, చంద్రశేఖర్ ఆచారి, చలపతి, హనుమంతు రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## రమేష్ నాయక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూత



తిరుపతి క్రైం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ 669 ఎం.రమేష్ నాయక్ 2023 సెప్టెంబర్ 30వ తేదిన అనారోగ్యం కారణంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. సదరు దివంగత ఎస్ఐ కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతనిస్తూ జిల్లా పోలీసు సంక్షేమ నిధి నుండి విడో ఫండ్ 50వేల రూపాయిలను జిల్లా ఎస్పి మంజూరు చేసారు. సంబంధిత చెక్కును తిరుపతి జిల్లా ఎస్పి మలిక గర్గ్ దివంగత ఎస్ఐ 669 ఎం. రమేష్ నాయక్ సతీమణి ఎం. చంద్రకళకి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అందజేసారు. కీర్తి శేషులైన ఎస్ఐ వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకాల ద్వారా ఒక ఉద్యోగాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఎస్ఐ కుటుంబ సభ్యులకు తెలిపారు.

## శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ బదిలీ

**చుడా సూపరింటెండెంట్‌కు అవకాశం**



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబును బదిలి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తిరుపతి పార్లమెంటు ఉన్నందువల్ల శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌కు బదిలి ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర వ్యాప్తంగా 37 మందిని బదిలి చేసారు. వారిలో శ్రీకాళహస్తి కమిషనర్ ఉన్నారు. రమేష్‌బాబును జంగారెడ్డిగూడెం మున్సిపాలిటి కమిషనర్‌గా బదిలి చేసారు. ఆయన స్థానంలో చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటితో సూపరిం టెండెంట్‌గా పని చేస్తున్న ఆర్.రాంబాబును నియమించారు. రాంబాబు ఆరునెలలుగా సెలవులో ఉంటూ ఇటీవలే విధి నిర్వహణలో చేరినట్లు సమాచారం. రెండు రోజుల ముందే ఆయన చిత్తూరులో నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఆయనకు మరో ఏడాది మాత్రమే సర్వీసు ఉన్నట్లు సమాచారం. రమేష్‌బాబు హయాంలో పారిశుద్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

## తిరుపతి పార్లమెంట్ జిల్లాలో బిజెపితోనే అభివృద్ధి

**-ప్రజాపోరులో మునిసుబ్రమణ్యం**



తిరుపతి, ఫిబ్రవరి 27ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో తిరుపతి పార్లమెంట్ జిల్లాను అభివృద్ధి చేయడం సులభమని బిజెపి రాష్ట్ర కార్యదర్శి, ప్రజాపోరు జిల్లా కన్వీనర్ ఎస్. మునిసుబ్రమణ్యం తెలిపారు. మోదీ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి, నిధులు కేటాయింపుతోనే అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. ప్రజాపోరులో భాగంగా మంగళవారం ఉదయం బైరాగిపట్టెడ, మున్సిపల్‌పార్కు, కపిలతీర్థం నందిసర్కిల్, డిఆర్ మహల్‌రోడ్డు ప్రాంతాల్లో ప్రజాపోరు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాధరెడ్డి, విశ్వనాథ్, వరప్రసాద్, భాస్కర్ తదితరులతో కలసి స్వచ్ఛభారత్, ప్రతి ఇంటికి ఐదుకిలోల ఉచిత బియ్యం పంపిణీ, అంత్యోదయ పథకం క్రింద 200 రూపాయలకే కొళాయి కనెక్షన్ కేంద్రం నిధులతో చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. తిరుపతిని ఇప్పటికే కేంద్ర నిధులతో అభివృద్ధిచేశామని, అయితే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, తిరుపతిలో వైసిపి నేతలు తామే అభివృద్ధిచేశామని డప్పుకొడుతున్నారని అన్నారు. ఇలాంటివన్నీ ప్రజలు తెలుసుకుని రానున్న ఎన్నికల్లో బిజెపిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వాచ్‌మేన్ మృతి!

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లి సర్కిల్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని వాచ్‌మేన్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుడు పశుపతి అపార్ట్మెంట్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న జి. వెంకటాద్రి (42)గా పోలీసులు గుర్తించారు. పాల ప్యాకెట్‌కు రోడ్డుపై వెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్రవ వాహనం సోమవారం రాత్రి ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున రూయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. పాకాల మండలం, దిన్నిపేట గ్రామానికి చెందిన వెంకటాద్రి భార్య పార్వతి కుమారుడితో కలిసి అపార్ట్మెంట్‌లో నివాసముంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడిభార్య పార్వతి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ ఎఎస్ఐ జోగారావు కేసు నమోదు చేసారు.

## బలిజ సామాజిక వర్గ నేతల దారెటు!

**- చిత్తూరు నుండి ఇరు పార్టీల్లో బలిజలకు దక్కని అభ్యర్థిత్వాలు**

చిత్తూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నుండి పోటీ చేయడానికి ఇటు అధికార వైకాపా, అటు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీల నుండి బలిజ సామాజిక వర్గ నేతలకు అవకాశం దక్కకపోవడంతో ఈ ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గం దారెటు అనే ప్రచారం ప్రారంభమైంది. 2019 ఎన్నికల్లో అధికార వైకాపా చిత్తూరు నుండి ఆరణి శ్రీనివాసులుకు అభ్యర్థిత్వం కేటాయించడంతో ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల అభ్యర్థుల ఖరారులో భాగంగా వైకాపా అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ప్రక్కన పెట్టి ఇక్కడి నుండి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎంసి విజయానందరెడ్డి అభ్యర్థిత్వంను ఖరారు చేసింది. అధికార వైకాపా బలిజ సామాజిక వర్గం నుండి అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ఆ వర్గ నేతలు అధికార వైకాపాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలిజ సామాజిక వర్గంకు అభ్యర్థిత్వం కేటాయిస్తుందని, ఈ మేరకు బలిజ సామాజిక వర్గం అంతా కలసికట్టుగా తెలుగుదేశం అభ్యర్థిత్వం కేటాయించే బలిజ సామాజిక వర్గ అభ్యర్థి విజయంకు కృషి చేయాలని ఇటీవల బలిజ సంక్షేమ సంఘ నాయకులు సమావేశమై తీర్మానించారు. అయితే అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం శనివారం విడుదల చేసిన తొలి అభ్యర్థుల జాబితాలో చిత్తూరు నుండి కమ్మ సామాజిక వర్గానికి చెందిన గురజాల జగన్మోహన్‌నాయుడు పేరును ఖరారు చేసి బలిజ సామాజిక వర్గానికి షాక్ ఇచ్చింది. చిత్తూరు నుండి బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ టిటిడి ఛైర్మన్ దివంగత డికె ఆదికేశవులు కుమార్తె తేజోశ్వరీ, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీలు పోటీ పడ్డారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం వీరిలో ఎవరికి అభ్యర్థిత్వం కేటాయించినా వారికి మద్దుతుగా నిలిచి చిత్తూరులో సత్తా చాటాలని సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో ఇటు అధికార వైకాపా, అటు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు చిత్తూరు నుండి బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేయడానికి ఖరారు చేయకపోవడంతో ఈ ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గం ఎటు వైపు వెళ్తుందనే ప్రచారం చిత్తూరు నియోజకవర్గంలో ప్రారంభం అయ్యింది.

## శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యలతో సతమతం

**శివయ్య పండగంటే చిరుద్యోగులు పస్తుండాలా?**



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం మహాశివరాత్రి అంటే కొందరు అధికార పార్టీ నాయకులకు ఆలయంలో పని చేసే కొందరు ఉద్యోగులు బినామి కాంట్రాక్టులుగా మారారనే విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ ఉద్యోగులు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో శివరాత్రి పనులు చేస్తూ లబ్దిపొందుతున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ శివరాత్రి పనులను అధికార పార్టీ నాయకులనునమ్ముకున్న వారికే దక్కుతున్నాయి. ఇక్కడ టెండర్లు పిలిచినా వేసే దిక్కులేదు. ఈ ఏడాది శివరాత్రి ముందు దేవస్థానం చేపట్టిన పనులతో పట్టణ వాసులు ముప్పుతిప్పలు పడుతున్నారు. గత ఏడాది అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు పనుల కోసం నాలుగు మాడా వీధులను ధ్వంసం చేసారు. నెలల తరబడి రోడ్డుపై గతుకులు వాహన చోదకులను తిప్పలు పెట్టింది. ఏడాది పాటు మౌనం వహించిన దేవస్థానం మరో పదిహేను రోజులు శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా వీధి లైట్ల పనులను చేపట్టారు. దానికి ప్రత్యేక కేబుల్ ఏర్పాటుకు మళ్లీ నాలుగుమాడావీధుల్లో గోతులు తవ్వారు. దాంతో ట్రాఫిక్ సమస్య ఇంతా అంతా కాదు.

**రోడ్లు నిర్మాణం:**

కాగా నెలల ముందుమంజూరు అయిన దిగువ సన్నిధివీధి రోడ్డు పనుల గురించి పట్టించుకోని ఇంజనీరింగ్ విభాగం ఇప్పుడు నిద్రమేల్కొన్నట్లు ప్రారంభించారు. దాంతో ఆ వైపు వెళ్ళు వాహనాలు కూడా నాలుగుమాడావీధుల్లో సంచరించాల్సి రావటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మరో వైపు తేరువీది నుంచి సన్నిధివీధిలోని రామమందిరం వద్దకు రూపకల్పన చేస్తున్నారు. ఈ పనులు కూడా ఆటంకంగా మారింది. ఇక ఓ వైపు షెడ్డు, మరో వైపు గోడ నిర్మాణం, ఇంకో వైపు ధూర్జటి కళాప్రాంగణం పనులతో తిక మక పడుతున్నారు.

## గుట్టపై ఆక్రమణలు తొలగింపు

**గూళ్లు చెదరగొట్టారంటూ బాధితుల ఆవేదన**

**ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు : ఆర్డీఓ**



రేణిగుంట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి లెక్క దాఖల సర్వే నెం.153లో ఇళ్ళ కోసం కొంత మంది ఆక్రమించుకుని గుడారాలు వేసుకున్న స్థలాలను మంగళ వారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరింప చేశారు. సుమారు 2 వేల గుడారాలను గుడిసెలను రెవెన్యూ అధికారులు తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత యుద్ధ వాతావరణం తలపించింది. ముందస్తు భద్రత కోసం కొంత మంది సీపీఎంనేతలను హౌస్ అరెస్టు చేశారు. గుడిసెలు తొలగిస్తున్న సమయంలో ఇంటిస్థలాల సాధన పోరాట నేతలు రాజశేఖర్, సత్యశ్రీ, రాధిక, మునిబాబు, అరుణ్, మస్తాన్, సీపీఎం పార్టీ నేత శివానందం తదితరులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొంత మంది నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టును నిరసిస్తూ బాధితులు రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ విషయమై శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి వివరణ ఇస్తూ 1560 మంది బాధితులు ఇంటి స్థలాల కోసం ఆధార్ కార్డులు ఇచ్చారన్నారు. వారిలో సుమారు 908 మందికి ఇంటి స్థలాలు ఇప్పటికే ఇచ్చామన్నారు. రేణిగుంటకు చెందిన వారు కేవలం 150 మంది మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఆక్రమణ దారుల్లో ఇతర జిల్లాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించకూడదన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా స్థలం తమదంటూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తే తాము కూడా న్యాయస్థానాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకుని ప్రభుత్వస్థలాలను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామన్నారు.

## ఆర్టీసి కార్మికుల సంక్షేమానికి కృషి

**-శ్రీవారి దర్శనం చేసుకున్న ఆర్టీసి వైస్‌ఛైర్మన్ మిద్దెల హరి**



తిరుమల, ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఆర్టీసికార్మికుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పూర్తి కృషి చేస్తున్నారని ఆర్టీసి వైస్‌ఛైర్మన్ మిద్దెల హరి తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు మరింతగా అంకిత భావంతో పనిచేసి ప్రయాణీకులకు, తిరుమల భక్తులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చాలని సూచించారు. ఆర్టీసి వైస్‌ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలి సారిగా మంగళవారం ఉదయం తిరుమలకు వచ్చారు. దేవదేవుడిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమల ఆర్టీసి డిపోను, గ్యారేజీని సందర్శించారు. అక్కడ కార్మికులతో కలసి వారి సమస్యలు, బస్సుల కండీషన్ తెలుసుకున్నారు. రోజుకు లక్షమంది వస్తున్న భక్తుల్లో 50వేలమందిని ఆర్టీసి బస్సులద్వారా తిరుమల-తిరుపతి మధ్య, ఇతరప్రాంతాలకు చేరవేస్తున్నామన్నారు. భక్తుల భద్రతకు మరింతగా దృష్టిపెట్టాలని కోరారు. ఈ సందర్బంగా తిరుపతి ఆర్టీసి ఆర్ఎం టి.చెంగల్‌రెడ్డి, తిరుమల డిఎం విశ్వనాథం పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సెల్ఫ్ డిఫెన్స్‌పై వారం రోజుల శిక్షణ



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. ఉమాదేవి ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ అనే అంశం పైన ఒక వారం రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఈ నెల 26వ తేది నుండి మార్చి 3వ తేది వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. అనురాధ, సోషల్ సైన్స్ డీన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో మహిళలపై వేధింపులు, దాడులు కూడా పెరుగుతున్నాయని, ఆపద సమయంలో సహాయం కోసం ఎదురు చూడటం కంటే తమని తాము రక్షించుకునే ఆత్మరక్షణ విద్యల్లో మెలకువలను నేర్చుకోవడంలో శిక్షణ తప్పక తీసుకోవాలని లక్ష సాధనలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించినప్పుడే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం మహిళ అధ్యయన కేంద్ర, విభాగ హెడ్ ఇంచార్జ్ డాక్టర్ పి.నీరజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆత్మ విశ్వాసంతో అవరోధాలపై ఆధిపత్యం సాధించగలిగితే విజయం సాధించడం మరింత సులభతరం అవుతుందన్నారు. అనంతరం మార్షల్ ఆర్ట్స్ శిక్షకులుగా ధనంజయలు విచ్చేసి విద్యార్థులకు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండుటకు ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, పరిశీలన తదితర అంశాలపైన పూర్తి అవగాహన కల్పించి ఆత్మరక్షణ సాధనంగా మార్షల్ ఆర్ట్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలుపుతూ, స్వీయ రక్షణ చిట్కాలను విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఎం. ఇంద్రాణి పాల్గొన్నారు.

## వేమిరెడ్డికి శివరాత్రి ఆహ్వానం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి భూరి విరాళాలను, ఉత్సవ వాహనా లను బంగారుమయం చేసి ఆలయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో తనదంటూ గుర్తింపు తెచ్చుకున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వ్యక్తిగతంగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మార్చి 3నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఆహ్వానించారు. ఈ మేరకు ఛైర్మెన్‌తో పాటు ఎఇఒ ఏకే ధనపాల్, సుదర్శన్‌రెడ్డి, వేదపండితులు ఆంజనేయ శర్మ, త్రినాధ్‌శర్మ, పార్టీ ప్రముఖులు నరసింహారాజు (నంద), సునీల్, తేజ తదితరులు హాజరై వేమిరెడ్డికి శివయ్య ప్రసాదాలను అందించారు. వారికి దేవస్థానం తరపున సత్కరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందించారు.




## మీ మేలు మరవలేము

**-టిటిడి ఛైర్మన్ భూమనకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సన్మానం**



టిటిడిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న 9వేలమంది ఉద్యోగులు, కార్మికులకు పెద్ద మొత్తంలో వేతనాలు పెంచారు. ఈ పెంపు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ద్వారానే సాధ్యమైందని ఉద్యోగులు ఆయనను కలిసి సన్మానించారు.

**శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానము**

హిందూ దేవాదాయశాఖ, సూళ్ళూరుపేట, తిరుపతి జిల్లా

ఆర్.సి.నెం.నిల్/2024, తేది 19-02-2024 **బహిరంగ వేలము ప్రకటన**

తిరుపతి జిల్లా, సూళ్ళూరుపేట శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానము నందు దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింద తెలుపబడిన 6 షాపులు 02-03-2024వ తేది శనివారం ఉదయం 11.00గంటలకు హిందూ దేవాదాయశాఖ, అధికారుల సమక్షమున బహిరంగ వేలము ఈ క్రింది తెలిపిన వాటిని కౌలుకు ఇవ్వబడును.
**వేలం పాట వివరములు** : టెండరు షెడ్యూలు విక్రయించు తేది : 19-02-2024 నుండి 01-03-2024 సాయంత్రం 6గంటల వరకు విక్రయించబడును.
**టెండర్లు సమర్పించవలసిన ఆఖరి తేది** : 02-03-2024 నుండి ఉదయం 10.00గంటల లోపల కార్యనిర్వహణాధికారి కార్యాలయము నందు సమర్పించవలెను.

| నెం. | కౌలుకిచ్చు వివరములు | పొడవు,వెడల్పు | కౌలు కాలము | ధరావత్తు | టెండర్ షెడ్యూలు |
|---|---|---|---|---|---|
| 01 | ఉత్తర భాగమున దేవస్థానము ఎడవ వైపు షాపు నెం.01 | 15 x 10 | 02-03-2024 నుండి 01-03-2027 వరకు (3 సం॥వ మాత్రమే | రూ॥50,000/- (యాభైవేలు మాత్రమే) | రూ॥1000/-లు, ఒక్కటి |
| 02 | ఉత్తర భాగమున దేవస్థానము ఎడవ వైపు షాపు నెం.02 | 15 x 10 | 02-03-2024 నుండి 01-03-2027 వరకు (3 సం॥వ మాత్రమే | రూ॥50,000/- (యాభైవేలు మాత్రమే) | రూ॥1000/-లు, ఒక్కటి |
| 03 | ఉత్తర భాగమున దేవస్థానము ఎడవ వైపు షాపు నెం.03 | 15 x 10 | 02-03-2024 నుండి 01-03-2027 వరకు (3 సం॥వ మాత్రమే | రూ॥50,000/- (యాభైవేలు మాత్రమే) | రూ॥1000/-లు, ఒక్కటి |
| 04 | ఉత్తర భాగమున దేవస్థానము ఎడవ వైపు షాపు నెం.04 | 15 x 10 | 02-03-2024 నుండి 01-03-2027 వరకు (3 సం॥వ మాత్రమే | రూ॥50,000/- (యాభైవేలు మాత్రమే) | రూ॥1000/-లు, ఒక్కటి |
| 05 | ఉత్తర భాగమున దేవస్థానము ఎడవ వైపు షాపు నెం.05 | 15 x 10 | 02-03-2024 నుండి 01-03-2027 వరకు (3 సం॥వ మాత్రమే | రూ॥50,000/- (యాభైవేలు మాత్రమే) | రూ॥1000/-లు, ఒక్కటి |
| 06 | ఉత్తర భాగమున దేవస్థానము ఎడవ వైపు షాపు నెం.06 | 15 x 10 | 02-03-2024 నుండి 01-03-2027 వరకు (3 సం॥వ మాత్రమే | రూ॥50,000/- (యాభైవేలు మాత్రమే) | రూ॥1000/-లు, ఒక్కటి |

ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి
తేది: 19-02-2024
కార్యనిర్వహణాధికారి

# ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం: జాయింట్ కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మంగళవారం జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, డిప్యూటీ తహసిల్దార్లు, రీ-సర్వే డిటిలు, సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఇళ్ళు నిర్మించుకొన్న లబ్దిదారులకే కాకుండా స్థలాలను సైతం రిజిస్ట్రేషన్ చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మ్యుటేషన్ కార్యక్రమంలో ఏదైనా తప్పులు దొర్లివుంటే వాటిని సరిదిద్దుకోవాలన్నారు. ఆర్డీఓ స్థాయిలో దీనికి అనుమతి రావడం జరిగిందని ఈ కార్యక్రమంను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అలాగే అసైన్డ్ భూములకు సంబంధించి రీ-వెరిఫికేషన్ చేసి అర్హులకు పట్టాలు అందించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఫ్రీహోల్డ్ రైట్స్‌కు సంబంధించి మరికొన్ని పూర్తి చేయాల్సి వుందని, విఆర్ఓ స్థాయిలో పూర్తయి వుంటే తహసిల్దారు స్థాయిలో పూర్తి చేసి ఆర్డీఓ స్థాయిలో అనుమతి పొందాలన్నారు. జిల్లాలో 1,500 ఓటర్ల కంటే మించి వున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఒకవేళ ఎక్కువ వున్నట్లైతే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సర్వే ఎడి మహబూబ్ భాష, తదితరులు పాల్గొన్నారు.